
బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో ఇసుక నిల్వ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ


కొత్తవలస: అర్దానపాలెం మోడల్ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్

- జిల్లాలో ఇసుక అమ్మకాలు ప్రారంభం
- టన్ను ఇసుక ధర రూ.605గా నిర్ణయం
- జీవో విడుదలలో కాస్త ఆలస్యం
- మూడు కేంద్రాల్లో 92వేల టన్నుల నిల్వలు

ఉచితం.. సాకారం


కొత్తవలసలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి


డెంకాడలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక పథకం జిల్లాలో ప్రారంభమైంది. స్టాక్ పాయింట్లుగా నిర్ణయించిన బొబ్బిలి, కొత్తవలస, డెంకాడ నుంచి సోమవారం సరఫరా మొదలైంది. టన్ను ఇసుక ధర రూ.605గా జిల్లా కమిటీ నిర్ణయించింది. దీంట్లో ప్రభుత్వ ఫీజు లేదు. నిర్వహణ, స్థానిక చార్జీలు కలిపి ధరగా నిర్ణయించారు. ఒకరికి రోజుకు 20 టన్నుల ఇసుక కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. అయితే జీవో సకాలంలో జిల్లా అధికారులకు చేరకపోవడంతో తొలిరోజు ఇసుక అమ్మకాలు ఆలస్యంగా మొదలయ్యాయి. సోమవారం సాయంత్రం వరకు ఇసుక కోసం కొనుగోలుదారులు వేచి చూశారు. అన్నిచోట్లా స్టాకు అయితే సిద్ధం చేశారు. డెంకాడ స్టాక్ పాయింట్‌ను గనుల శాఖ డీడీ పర్యవేక్షించారు. ఆన్‌లైన్లో చెల్లించాల్సిన నగదు చెల్లింపుల విషయంలో స్పష్టత రాకపోవటంతో మొదటి రోజు అమ్మకాలకు అవరోధం ఏర్పడింది.

- బొబ్బిలి గ్రోత్ సెంటర్లో భారీగా ఇసుక నిల్వలు ఉన్నాయి. నాగావళి నది నుంచి ఇసుక నిల్వలను తరలించి స్టాక్ చేశారు. అలాగే డెంకాడ మండలం పెదతాడివాడ వద్ద విజయనగరం చుట్టుపక్కల ప్రాంతాల వినియోగదార్లకు అందుబాటులో ఉండేలా స్టాక్ పాయింట్ పెట్టారు. ఈ కేంద్రానికి శ్రీకాకుళం జిల్లాలోని వంశధార నది నుంచి ఇసుక నిల్వలను తెప్పిస్తున్నారు. ఇక కొత్తవలస కేంద్రానికి గోస్తని నది నుంచి నిల్వలు తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. ఇలా జిల్లాలోని మూడు ప్రధాన కేంద్రాల్లో వినియోగదార్లకు ఇసుకను అందుబాటులో ఉంచారు.
- మూడు స్టాక్ పాయింట్ల వద్ద 92వేల టన్నుల ఇసుకను సిద్ధం చేశారు. కొత్తవలసలో 11,805, డెంకాడలో 9,756, బొబ్బిలిలో 72,466 టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లోని నదుల నుంచి ఇసుకను తీసుకు వచ్చి స్టాక్ చేసేందుకు నిర్ణయించారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే అమ్మకాలకు అనుమతించారు. అమ్మకాలపై సందేహాలు, ఫిర్యాదుల కోసం ఫోన్ నంబర్ 9032338135ను సంప్రదించవచ్చు. జిల్లా స్థాయిలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు వీలుగా రెవెన్యూ, గనుల శాఖ, సెబ్, పంచాయతీరాజ్ శాఖల అధికారుల ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారు. అయితే మొదటి రోజు ఇసుక అమ్మకాలు వినియోగదార్లను కాస్త నిరాశ పరిచాయి.

కొత్తవలసలో..

కొత్తవలస : కొత్తవలస పంచాయతీ అర్దానపాలెం మోడల్ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్‌ను శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీ పేదలకు వరమన్నారు. కార్యక్రమంలో నాయకులు గొరపల్లి రాము, కొరుపోలు అప్పారావు, బొబ్బిలి రమణ, రెడ్డిపైడం నాయుడు పాల్గొన్నారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్‌సెంటరులో ఇసుక నిల్వకేంద్రాన్ని ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ సోమవారం ప్రారంభించారు. గతంలో ఇక్కడ గనులశాఖ ఆధ్వర్యంలో ఇసుక నిల్వకేంద్రాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కొన్నేళ్లుగా ఈ కేంద్రంలో కార్యకలాపాలు నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో మళ్లీ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కేంద్రంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు త్రినాథరావునాయుడు, ఆర్‌ఐ కళ్యాణచక్రవర్తి, టీడీపీ నాయకులు గెంబలి శ్రీనివాసరావు, బొద్దాన అప్పారావు, కాగాన సునీల్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడలో..

డెంకాడ: పెదతాడివాడ వద్ద ఇసుక నిల్వ కేంద్రాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఒక మెట్రిక్ టన్ను ఇసుకను రవాణా చార్జీలు, లోడింగ్‌తో కలిపి రూ.605గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఇసుక పూర్తిగా ఉచితమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు, మైన్స్ డీడీ సూర్యచంద్రరావు, తహసీల్దార్ రామారావు, టీడీపీ నాయకులు పల్లె భాస్కరరావు, చిరంజీవిరాజు, పాణి రాజు, జనసేన నాయకులు తుమ్మి అప్పలరాజు దొర, చింతపల్లి రామ్మూర్తి, ఎస్‌ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ముప్పు

- పెద్ద శబ్దంతో పేలిపోయిన బస్సు టైర్
- చాకచక్యంతో నిలిపిన డ్రైవర్

రాజాం రూరల్, జూలై 8: రాజాం బస్టాండ్ నుంచి బొబ్బిలి వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు పెద్ద ప్రమాదం తప్పింది. ఫ్రంట్ టైర్ పెద్ద శబ్దంతో పేలిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి డివైడర్‌ను ఢీకొట్టకుండా టైరు పేలినచోటే బస్సు నిలిపేశారు. సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో రాజాం-బొబ్బిలి రోడ్డులో సెయింటాన్స్ ఆసుపత్రి సమీపంలో ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే..

రాజాం నుంచి బొబ్బిలి వెళ్లాల్సిన శ్రీకాకుళం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బయలుదేరింది. బొబ్బిలి రోడ్డులోని సెయింటాన్స్ ఆసుపత్రి సమీపానికి చేరుకునే సరికి బస్సు ముందు భాగం నుంచి పెద్ద శబ్దం రావడం, పొగలు చిమ్మడంతో డ్రైవర్ రంగారావు కొద్ది క్షణాల పాటు ఖంగారుపడ్డారు. అంతలోనే తేరుకుని టైర్ పేలిందని నిర్ధారణకొచ్చి రెప్పపాటులోనే డివైడర్‌ను బస్సు ఢీకొంటే బోల్తా పడుతుందని ఊహించి టైరు పేలిన ప్రదేశంలోనే బస్సు నిలిచిపోయేలా ప్రయత్నం చేసి సఫలమయ్యారు. దీంతో అప్పటివరకూ కేకలు వేసిన ప్రయాణికులు ప్రమాదం జరగలేదని నిర్ధారణకొచ్చాక హమ్మయ్యా.. అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో పదిమంది ప్రయాణికులున్నారు. వీరిని వేరే బస్సులో వారి వారి గమ్యస్థానాలకు వెళ్లేలా డ్రైవర్, కండక్టర్ చర్యలు తీసుకున్నారు.



రాజాంలో టైరు పేలి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు, (ఇన్‌సెట్)లో చిట్లిన ఫ్రంట్ టైరు


ధర్నా చేస్తున్న గో సంరక్షణ సమాఖ్య, జంతు సంక్షేమ సంఘం, హిందూ సంఘం ప్రతినిధులు

వారిపై రౌడీషీట్ తెరవాలి

- కబేళా మూయకపోతే దీక్ష చేపడతాం
- గో సంరక్షణ, జంతు సంక్షేమ, హిందూ సంఘాల ధర్నా

విజయనగరం(ఆంధ్రజ్యోతి), జూలై 8: జిల్లాలో వేలాది మూగజీవాలను అక్రమంగా కబేళాలకు తరలించి, కర్కశంగా హతమార్చి, వాటి మాంసాన్ని అమ్ముకుని వ్యాపారం చేస్తున్నారని, పశువధకు పాల్పడిన వారిపై కేసు నమోదు చెయ్యటమే కాకుండా నిర్వాహకులపై రౌడీషీట్ తెరవాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, జంతు సంక్షేమ సంఘం, హిందూ సంఘం ప్రతినిధి ఎస్.సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోవధ శాలను మూసివేయాలని, లేకుంటే తామంతా నిరాహార దీక్ష చేపడతామన్నారు. సోమవారం కలెక్టరేట్ ముందు వారంతా ధర్నా చేశారు. లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వందలాదిగా ఉన్న అక్రమ పశు వధశాలలను సీజ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్, పశు సంవర్ధక శాఖ జేడీ, మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో చోళ్ల రాజకుమారి, మద్దిల సోంబాబు, రెడ్డిపల్లి రవిశంకర్, హిందు సంఘ ప్రతినిధులు మజ్జి రామారావు, ఉప్పాడ పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

అక్కడ కాకుంటే ఇక్కడకు రండి

- విన్నపాలపై ప్రజలకు కలెక్టర్ అంబేడ్కర్ సూచన

కలెక్టరేట్, జూలై 8: వివిధ ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలు ముందుగా ఆయా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతులు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని పక్షంలో డివిజన్, జిల్లా కేంద్రాల్లో ఇవ్వవచ్చని కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ సూచించారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలపై అర్జీదారులు వ్యయ ప్రయాసలు పడి జిల్లా కేంద్రానికి రానవసరం లేదని చెప్పారు. మండలంలో కూడా తహసీల్దార్లు, ఎంపీడీవోలు ప్రతి సోమవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. అంతకుముందు అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలోనూ అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఇక నుంచి జిల్లాలో ఎక్కడైనా అక్రమ మైనింగ్ జరిగితే సహించేది లేదన్నారు. తెర్లాంలో విషజ్వరాల నియంత్రణకు వెంటనే చర్యలు చేపట్టి నివేదిక ఇవ్వాలని జిల్లా వైద్యా ఆరోగ్య అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

- కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 186 వినతులు వచ్చాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 81 , డీఆర్‌డీఏ 51, డీపీవో 11, విద్యాశాఖకు 10, మున్సిపల్ శాఖకు 9, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ సంస్థలకు 4 చొప్పున, గృహ నిర్మాణం, గ్రామ వార్డు సచివాలయం శాఖలకు మూడు వినతులు వచ్చాయి.


మహిళలు ఇచ్చిన వినతిని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

రైతుల నిరీక్షణ

- వాన కురిస్తేనే నారు వేసేందుకు అవకాశం
- ఇప్పటి వరకూ 50 వేల ఎకరాల్లోనే..
- జూలైలో కనీస స్థాయిలో కురవని వర్షం
- ప్రత్యామ్నాయ పంటల వైపు చూపు


వర్షాలు లేకపోయినా వరి విత్తు వేసుకుంటున్న రైతు

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ కలెక్టరేట్, జూలై 8: ఖరీఫ్ సీజన్ మొదలైనా వరుణుడు మొహం చాటేశాడు.. మేఘాలు తప్పా చినుకు జాడ లేదు.. వరి నారు వేసుకోవడానికి ఇదే సమయం కావడంతో వర్షం కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో కాస్త వర్షాలు కురిసినా జూలైలో మాత్రం కనీస స్థాయిలో పడలేదు. ఈ పరిస్థితిలో కొందరు రైతులు ప్రత్యామ్నాయ ఆలోచనలో పడ్డారు. వరికి బదులుగా నీలగిరి వైపు మొగ్గు చూపిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 2,50,000 ఎకరాల్లో వరి పంట సాగులో ఉండాలి. చాలా చోట్ల వర్షాధారంపైనే సాగు చేస్తున్నారు. అయితే వర్షాలు కురవకపోయినా సమయం దాటిన తరువాత వరి నారు వేసుకుంటే ఉపయోగం ఉండదని చాలా మంది రైతులు తప్పని పరిస్థితిలో వరి విత్తుతున్నారు. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వరి పంట అనుకూలంగా ఉండాలంటే జూన్ నుంచి సెప్టెంబరు వరకూ విస్తారంగా వర్షాలు కురవాలి. ఆ పరిస్థితి కనిపించడం లేదు. జూన్‌లో 124 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 214 మిల్లీమీటర్లు కురిసింది. కురవాల్సిన వర్షం కంటే 73 మిల్లిమీటర్లు ఎక్కువే కురిసింది. జూలైలో 171 మిల్లీమీటర్ల సాధారణ వర్షం కురవాలి. ఇప్పటివరకు 3 మిల్లీమీటర్ల వర్షమే పడింది. గత ఏడాది జూన్‌లో 124 మిల్లీమీటర్లు వర్షం కురవాల్సి ఉండగా, 59 మిల్లీమీటర్లు కురిసింది. అదే ఏడాది జూలైలో 171 మిల్లీమీటర్లు కురవాలి. కానీ 312 మిల్లీ మీటర్లు పడింది. జూలైలో అధికంగా వర్షం కురిస్తే వరి నారు వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు.

నీలగిరి వైపు రైతుల మొగ్గు

కొన్నాళ్లుగా వరి సాగుపై రైతులు అసంతృప్తితో ఉంటున్నారు. పెట్టుబడి పెరగడంతో పాటు పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపిస్తున్నారు. ప్రధానంగా నీలగిరి మొక్కలు వేసుకుంటున్నారు. ఎకరా విస్తీర్ణంలో వరి సాగు చేస్తే సుమారు రూ.30వేల నుంచి 35 వేల వరకూ ఖర్చు అవుతుంది. పంట బాగా పండితే దాదాపు ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. వీటిని విక్రయిస్తే రూ.40 వేలు వస్తుంది. వర్షాలు సక్రమంగా కురవకపోతే పెట్టుబడి కూడా మిగిలే పరిస్థితి ఉండదు. అదే నీలగిరి పంట వేసుకుంటే ఎకరాకు సుమారు రూ.20 వేలు వరకూ ఖర్చు చేస్తే చాలు. ఎటువంటి పెట్టుబడి పెట్టకుండా ఐదేళ్ల తర్వాత మంచి ఆదాయం వస్తుంది. జిల్లా కేంద్రానికి ఆనుకున్న గ్రామాలతో పాటు మండల కేంద్రాల్లో ఉన్న గ్రామాల్లో అధికంగా లేఅవుట్లు పెరిగాయి. మరోవైపు నీలగిరి సాగు పెరుగుతోంది. ఈ విధంగా నానాటికీ వరి సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

రైతులు ఇప్పటి నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జూన్ నెలకు సంబంధించి సాధారణ వర్షపాతం నమోదైనా, జూలై నెలకు సంబంధించి కనీస స్థాయిలో నమోదు కాలేదు. వర్షాలు సమృద్ధిగా పడితే ఇబ్బంది ఉండదు. ఈలోగా అవసరాన్ని బట్టి యూరియా వేసుకోవాలి. 2 శాతం నీటిలో కలిపి పిచికారీ చేస్తే తేమ శాతం పెరుగుతుంది.

- రామారావు, జేడీ

గెడ్డ నీటికీ నోచుకోక..

రాజాం రూరల్, జూలై 8: గత పాలకుల నిర్లక్ష్యం అన్నదాతను ఇబ్బందుల్లో పడేసింది. అధికారంలో ఉన్న అయిదేళ్లూ సాగునీటి వ్యవస్థపై దృష్టి సారించకపోవడంతో రైతన్నలంతా ఆకాశం వైపు ఎదురు చూడాల్సిన దుస్థితి వచ్చింది. కనీసం గెడ్డల్లో పూడిక తొలగింపును కూడా చేపట్టలేకపోయారు. ఆక్రమణలనూ వదిలేశారు. రాజాం మండలంలోని అనేక గ్రామాల మీదుగా విస్తరించి ఉన్న సారధిగెడ్డ పరిస్థితి ఇందుకో ఉదాహరణ. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ఐదు మండలాల పరిధిలో సుమారు 30 వేల ఎకరాల భూములకు సాగునీరందించే గెడ్డ అది. ఆక్రమణల కారణంగా ఏయేటికాయేడు కుచించుకుపోతోంది. పిచ్చిమొక్కలతో నిండిపోయి సాగునీటి ప్రవాహానికి వీల్లేని విధంగా మారింది. జిల్లాలోని తెర్లాం మండల ంలోని మిగులు జలాలు రాజాం మండలంలోని వివిధ గ్రామాల చెరువులను నింపుతూ సారధిగెడ్డలోకి చేరి అపై శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలంలో పలు గ్రామాల మీదుగా పొందూరు మండలంలోని రెల్లిగెడ్డలోకి చేరుతున్నాయి. సుమారు 30 కిలోమీటర్ల మేర గెడ్డకు ఇరువైపులా కొందరు మోతుబరులు ఆక్రమణలకు తెగబడ్డారు. సరుగుడు, మామిడి తోటలు వేసేశారు. మరికొంత మంది చిన్న పొలాలుగా మార్చి సాగు చేసుకుంటున్నారు. దీంతో గెడ్డ రూపే మారిపోయింది. కొత్త ప్రభుత్వంలో అయినా గెడ్డకు పూర్వవైభవం తీసుకురావాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


పొదలతో నిండిపోయిన సారధిగెడ్డ

క్లాట్ నోటిఫికేషన్

దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్టియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ఛాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.

అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

దిక్సూచి DIKSUCHI

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ(ఎస్‌వీవీయూ)- 'డిప్లొమా ఇన్ యానిమల్ హస్బెండరీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 990 సీట్లు ఉన్నాయి.

శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీలో డిప్లొమా

అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా యూనివర్సిటీ అనుబంధ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. మిగిలిన 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల్లో చదివినవారికి నిర్దేశించారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు సెమిస్టర్లు చొప్పున మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి మూడు సెమిస్టర్లు కోర్సు వర్క్‌లు; చివరి సెమిస్టర్‌లో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ ప్రోగ్రామ్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఈ కోర్సు పూర్తిచేసినవారు 'బీవీఎస్సీ&ఏహెచ్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అనర్హులు. బీఎస్సీ(బయాలజీ స్ట్రీమ్) ప్రోగ్రామ్‌లు, బీ ఒకేషనల్(అగ్రికల్చర్/హార్టికల్చర్) ప్రోగ్రామ్‌లు, (బీఏ/బీకాం)(మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులు కాకుండా) ప్రోగ్రామ్‌లలో చేరవచ్చు.

అర్హత: అభ్యర్థులు ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ఐసీఎస్ఈ అభ్యర్థులు సైన్స్ మార్కుల కింద ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో వచ్చిన యావరేజ్ మార్కులను; సోషల్ మార్కుల కింద హిస్టరీ, సివిక్స్, జాగ్రఫీ సబ్జెక్టుల్లో వచ్చిన యావరేజ్ మార్కులను ఎంటర్ చేయాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 22
- **వెబ్‌సైట్:** www.svvu.edu.in

జాతీయ అత్యవసర పరిస్థితి(1975)

ఒక సమగ్ర అవగాహన

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఎమర్జెన్సీ విధించిన రోజు రాత్రి వార్తాపత్రికల ముద్రణాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉద్యమకారులు, నాయకుల అరెస్ట్‌ల సమాచారం వ్యాప్తిచెందకుండా సమాచార సాధనాలపై పలు ఆంక్షలు విధించారు. పత్రికలు తీవ్రంగా సెన్సార్‌షిప్‌నకు గురయ్యాయి. రేడియోలో ప్రభు త్వం ఇచ్చిన వార్తా సమాచారం మాత్రమే ఎప్పటికప్పుడు ప్రసారం అవుతుండేది.

జనాభాను నియంత్రించేందుకు వివాహం కాని పురుషులకు కూడా బలవంతంగా కుటుంబ నియంత్రణ(వ్యాసెక్టమీ) ఆపరేషన్లు నిర్వహించారు. ముఖ్యంగా ప్రతిపక్ష యువ నాయకులను లక్ష్యంగా చేసుకున్నారని ఒక ఆరోపణ. ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ ఈ కార్యక్రమం అమలుకు పూనుకోవడంతోపాటు పెద్ద ఎత్తున ఇతర అధికార దుర్వినియోగాలకు పాల్పడ్డాడని ఆరోపణలు వచ్చాయి. ప్రజల ప్రాథమిక హక్కులపై సైతం ఆంక్షలు విధించారు.

'ఏడీఎం జబల్‌పూర్ వర్సెస్ శివకాంత్ శుక్లా కేసు(1976)'లో అత్యవసర పరిస్థితి కాలంలో జీవించే హక్కు సహా అన్ని ప్రాథమిక హక్కులపై ప్రభుత్వం దేశ భద్రత దృష్ట్యా పరిమితులు విధించవచ్చని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దీనితో ఎమర్జెన్సీ కారణంగా ప్రకరణ 359 ప్రకారం ప్రజలు జీవించే హక్కు సహా ఇతర హక్కులను కోల్పోయి నట్లయింది.


అత్యవసర పరిస్థితి కాలంలో తమ చర్యల సానుకూలత కోసం, అధికారాన్ని నిలుపుకోవడానికి ఇందిర ప్రభుత్వం ప్రధానంగా మూడు రాజ్యాంగ సవరణలు చేసింది. అవి 1975లో 38వ, 39వ; 1976లో చేసిన 42వ రాజ్యాంగ సవరణ.

38వ రాజ్యాంగ సవరణ ప్రకారం రాష్ట్రపతి విధించిన అత్యవసర పరిస్థితిని, రాష్ట్రపతి-గవర్నర్లు-లెఫ్టినెంట్ గవర్నర్లు జారీ చేసే ఆర్డినెన్స్‌లను కోర్టుల న్యాయ సమీక్షాధికార పరిధి నుంచి తప్పించారు. 39వ రాజ్యాంగ సవరణను ఇందిరాగాంధీ తన ఎన్నిక చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును అధిగమించేందుకు చేసిన సవరణగా చెబుతుంటారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్ ఎన్నికకు సంబంధించిన అంశాలేవీ న్యాయ సమీక్ష పరిధిలోకి రాకుండా ఉండేలా ఈ సవరణను రూపొందించారు. కేంద్ర ప్రభుత్వ అధికారాలు, ప్రధాని అధికారాలను మరింతగా పెంచేలా 42వ రాజ్యాంగ సవరణ రూపొందింది. రాష్ట్ర చట్టాలను అధిగమించేందుకు, దేశంలోని ఏ ప్రాంతంలోనైనా కేంద్ర దళాలు మోహరించేందుకు, జాతి విద్రోహ కార్యక్రమాల సందర్భంలో ప్రాథమిక హక్కులను ఆసాంతం నిరాకరించే చట్టాలు అమలు చేసేందుకు, కేంద్ర, రాష్ట్ర శాసన సభల కాలపరిమితిని సైతం పెంచేందుకు ఈ సవరణ వీలు కల్పించింది. ఈ విధంగా ఎమర్జెన్సీ కాలంలో ప్రకరణ 352 నుంచి 360 వరకు గల అత్యవసర అధికారాలు తీవ్ర మార్పులకు గురయ్యాయి. దేశవ్యాప్తంగా చట్టాలు చేసే అధికారం కేంద్రానికే లభించి అధికార కేంద్రీకరణకు కారణమైంది.

ఎమర్జెన్సీ ఎత్తివేత: 1977 జనవరి 18న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మార్చి 16 నుంచి 20 వరకు ఎన్నికలు జరిగిన అనంతరం 1977 మార్చి 21న ఎమర్జెన్సీని ఎత్తివేశారు.

ఎమర్జెన్సీ అత్యవసర పరిస్థితులు

- 1977 సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.



- అత్యవసర పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ అధికారాలు, ప్రాథమిక హక్కుల పరంగా భారీ సవరణలు చేసిన రాజ్యాంగాన్ని తిరిగి సంస్కరించేందుకు జనతా ప్రభుత్వం పూనుకుంది. మరో భారీ సవరణ చేసింది. అదే 1978లో రూపొందించిన 44వ రాజ్యాంగ సవరణ. దీని ప్రకారం అత్యవసర పరిస్థితి విధించిన సందర్భాల్లోనూ రాజ్యాంగ ప్రకరణ 21 ద్వారా వస్తున్న ప్రాథమిక హక్కు అయిన 'జీవించే హక్కు'ను రద్దు పరచరాదు. అదేవిధంగా 'బాహ్య కారణాల వల్ల' అత్యవసర పరిస్థితి ప్రకటించినపుడు మాత్రమే ప్రకరణ 19లోని స్వేచ్ఛలు పరిమితమవుతాయి. 'సాయుధ తిరుగుబాటు' కారణంగా అత్యవసర పరిస్థితి ప్రకటించినపుడు వీటిపై ప్రభావం ఉండదు. అత్యవసర పరిస్థితికి సంబంధించిన చట్టాలు మినహా ఇతర చట్టాల ద్వారా రాజ్యాంగ స్వేచ్ఛలపై పరిమితులు విధించేందుకు వీలు లేదు. హక్కుల రద్దు అంశాలకు సంబంధించిన ప్రకరణలైన 358, 359లను 44వ రాజ్యాంగ సవరణ పరిమితం చేసింది. అంతేకాకుండా రాష్ట్రపతి జారీ చేసిన అత్యవసర పరిస్థితి ప్రకటనను తిరిగి న్యాయ సమీక్షాధికార పరిధిలోకి తీసుకొచ్చారు.
- 'క్యాబినెట్', 'లిఖిత పూర్వక' అనే పదాలను ప్రకరణ 352(3)లో చేర్చి ప్రధాని అధ్యక్షతన గల 'క్యాబినెట్' స్థాయి మంత్రుల 'లిఖిత పూర్వక' సలహా మేరకు మాత్రమే రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తారని సూచిస్తూ జాతీయ అత్యవసర పరిస్థితి విధింపు విధానాన్ని కొంత క్లిష్టం చేశారు.
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన తేదీ నుంచి నెల రోజుల లోపు అత్యవసర పరిస్థితి ప్రకటనను ప్రత్యేక మెజారిటీతో పార్లమెంట్ ఆమోదించాల్సి ఉంటుంది. ఒకవేళ అత్యవసర పరిస్థితి ప్రకటించే సమయానికి లోక్‌సభ రద్దయి ఉంటే తిరిగి కొత్త లోక్‌సభ ఏర్పడిన రోజు నుంచి 30 రోజులలోగా ఆమోదించాల్సి ఉంటుంది. ఈలోగా రాజ్యసభ అత్యవసర పరిస్థితి ప్రకటనను ఆమోదించాలి. లేనిచో 30 రోజుల తరవాత అత్యవసర పరిస్థితి తనంతతానుగా రద్దయిపోతుంది.
- ఒకసారి పార్లమెంట్ ఆమోదం పొందితే అత్యవసర పరిస్థితి ఆరు నెలల వరకు అమలులో ఉంటుంది. ఈవిధంగా ఆర్నెల్లకోసారి పార్లమెంట్ ప్రత్యేక మెజారిటీతో ఆమోదించి అత్యవసర పరిస్థితిని ఎన్ని పర్యాయాలైనా పొడిగించవచ్చని సవరణ చేశారు.
- 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 352లోని 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని తొలగించి దాని స్థానంలో 'సాయుధ తిరుగుబాటు'అనే పదాన్ని చేర్చారు. కనుక జాతీయ అత్యవసర పరిస్థితిని(ప్రకరణ 352) విధించాలంటే విదేశీ దాడి, యుద్ధం వంటి బాహ్య కారణాలు; సాయుధ తిరుగుబాటు వంటి అంతర్గత కారణాల రీత్యా మాత్రమే వీలవుతుంది. అదేవిధంగా 44వ రాజ్యాంగ సవరణ ద్వారా జాతీయ అత్యవసర పరిస్థితి రద్దుకు సంబంధించిన తీర్మానాన్ని కేవలం సాధారణ మెజారిటీతో ఆమోదించినా సరిపోతుంది అని అత్యవసర పరిస్థితి రద్దును సరళతరం చేశారు. లోక్‌సభ సమావేశంలో లేకుంటే లోక్‌సభలోని మొత్తం సభ్యుల్లో 1/10వ వంతు మంది సభ్యులు లోక్‌సభ ప్రత్యేక సమావేశం కోసం స్పీకర్ లేదా రాష్ట్రపతికి నోటీసు పంపినపుడు 14 రోజుల్లోపు రాష్ట్రపతి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంటుందని 44వ రాజ్యాంగ సవరణ నిర్ధారించింది.
- 1975 నుంచి 77 మధ్య కాలంలో కొనసాగిన జాతీయ అత్యవసర పరిస్థితి కాలంలో సంభవించిన అధికార దుర్వినియోగం, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన వంటి అనేక ఆరోపణలపై నిజ నిర్ధారణకు జనతా ప్రభుత్వం 1977లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జయంతి లాల్ ఛోటా లాల్‌షా నేతృత్వంలో 'షా కమిషన్'ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 1978లో సమర్పించిన నివేదికలో పేర్కొన్న సంఘటనలపై విచారణ జరిపేందుకు జనతా ప్రభుత్వం ప్రత్యేక కోర్టులను కూడా ఏర్పాటు చేసింది. జనతా ప్రభుత్వం 1979లో కూలిపోయింది. 1980లో అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ ప్రభుత్వం 'షా కమిషన్' నివేదికను ఉపసంహరించింది. సుప్రీంకోర్టు కూడా ప్రత్యేక కోర్టులు చెల్లవని తీర్పు చెప్పడంతో ఈ అంకానికి తెరపడింది.
- ఎమర్జెన్సీ కాలం నాటి పరిస్థితులు, ఇందిరా గాంధీ అవలంబించిన నిరంకుశ ధోరణి మాత్రం భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఎప్పటికీ ఒక మాయని మచ్చగానే మిగిలిపోయింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/bhtSZSEలో చదవండి.

కమల్‌హాసన్ 'సేనాపతి'గా నటించిన చిత్రం 'భారతీయుడు2'. 1996లో తెరకెక్కిన 'భారతీయుడు'కు సీక్వెల్‌గా శంకర్ దర్శకత్వం వహించగా, సుభాస్కరన్ నిర్మించారు. సిద్ధార్థ్, బాబీసింహా, ఎస్.జే.సూర్య, రకుల్ ప్రీత్‌సింగ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 12న 'భారతీయుడు 2' విడుదలవుతున్న సందర్భంగా సోమవారం చిత్రబృందం మీడియాతో సమావేశమై చిత్ర విశేషాలను పంచుకున్నారు.



తెలుగు ప్రేక్షకులే నన్ను స్టార్‌ను చేశారు

కమల్‌హాసన్

కమల్ హాసన్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులే నన్ను స్టార్‌ను చేసి ఈ స్థాయికి తెచ్చారు. ఈ సినిమాలో 'సేనాపతి' క్యారెక్టర్ చెప్పే డైలాగ్స్ సమాజంలో నుంచి పుట్టినవాటిలా ఉంటాయి. శంకర్ విజన్‌ను, మేకింగ్‌ను థియేటర్లలో చూసి ఆశ్చర్యపోతారు. రెండు వేళ్ల మడత పెట్టడం అంటే.. ఒకటి ఓటు వేసేది. రెండోది మన బాధ్యతది చెప్పేది' అని అన్నారు. శంకర్ మాట్లాడుతూ 'భారతీయుడు' టైమ్‌లో సీక్వెల్ తీస్తానని అస్సలు అనుకోలేదు. ఆ మూవీ తరువాత ఇన్నేళ్లలో ఎక్కడ లంచం తీసుకున్నారనే వార్తలు చదివినా నాకు సేనాపతి గుర్తుకు వచ్చేవారు. కానీ కథ కుదరక ఆగిపోయేవాడ్ని. సినిమాలో నేను రాసిన ప్రతీ సన్నివేశాన్ని కమల్‌హాసన్ తన నటనతో పదిరెట్లు పెంచారు' అని చెప్పారు. సిద్ధార్థ్ మాట్లాడుతూ 'భారతీయుడు 2' సినిమా సమాజంలో జరిగే అవినీతికి ఓ అప్‌డేటెడ్ యాంటీ వైరస్ లాంటిది. శంకర్ దర్శకత్వం వహించిన 'బాయ్స్'తోనే కెరీర్‌ను ఆరంభించాను. మళ్లీ 20 ఏళ్ల తరువాత ఇందులో నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉంది. యువత సమాజం కోసం ఏం చేయాలో చెప్పే చిత్రమిది' అని చెప్పారు. నిర్మాత సురేశ్‌బాబు మాట్లాడుతూ 'కమల్ హాసన్ ఇండియన్ సినిమా హద్దుల్ని చెరిపేస్తూ ముందుకు సాగుతుంటారు. డైరెక్టర్ శంకర్ సోషల్ మెసేజ్‌తో పాటు ఎంటర్టైన్‌మెంట్ జోడించి సినిమా తీసే విధానం అద్భుతం' అని అన్నారు. బాబీసింహా మాట్లాడుతూ 'భారతీయుడు' చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్లీ 28 ఏళ్ల తర్వాత 'భారతీయుడు 2'గా 'సేనాపతి' వస్తున్నాడు. ఈ చిత్రం మొదటి పార్ట్ కంటే పదింతలు హిట్ అవుతుంది' అని అన్నారు. రకుల్ ప్రీత్ మాట్లాడుతూ 'భారతీయుడు' సినిమా సీక్వెల్‌లో నేను నటిస్తానని కలలో కూడా అనుకోలేదు' అని చెప్పారు.

విజయ్ సినిమా మైత్రీ చేతుల్లో..



తమిళ అగ్రకథానాయకుడు విజయ్, దర్శకుడు వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'. ఈ సినిమాలో విజయ్ సరసన మీనాక్షి చౌదరి నటిస్తోంది. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో అందరి దృష్టినీ ఆకర్షించిన ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ విడుదల చేయనుంది. ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్ జయరామ్, స్నేహ, లైలా ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని కల్పాతి ఎస్ అఘోరం, కల్పాతి ఎస్. గణేశ్, కల్పాతి ఎస్.సురేశ్ నిర్మిస్తున్నారు.

వరుణ్‌తేజ్ విజృంభణ



వరుణ్‌తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'మట్కా'. ఓ యథార్థ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకొంటున్న ఈ చిత్రానికి కరుణకుమార్ దర్శకుడు. మీనాక్షి చౌదరి హీరోయిన్. బాలీవుడ్ నటి నోరా ఫతేహి కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్మించిన ఓ భారీ సెట్‌లో ప్రస్తుతం యాక్షన్ పార్ట్ చిత్రీకరణ జరుగుతోంది. సినిమాలో చాలా కీలకమైన ఓ ఫైట్‌ను విజయ్ మాస్టర్ సారథ్యంలో చిత్రీకరిస్తున్నారు. వరుణ్‌తేజ్ చాలా రిస్క్ తీసుకుని ఈ ఫైట్ చిత్రీకరణలో పాల్గొంటున్నారు. యాక్షన్ పార్ట్‌లో అతని విజృంభణను అదిరిపోయే లెవల్‌లో ఉంటుందని నిర్మాతలు చెప్పారు. అలాగే ఇంతవరకూ పోషించని ఓ విభిన్న పాత్రలో వరుణ్‌తేజ్ కనిపించి ఆడియన్స్‌ను అలరించనున్నారు. అతని కెరీర్‌లో ఇదొక మైలు రాయిగా నిలుస్తుందని దర్శకుడు కరుణకుమార్ చెబుతున్నారు. వింటేజ్ వైజాగ్‌ను ఈ సినిమాలో చూడవచ్చని అంటున్నారు. టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్న ఈ చిత్రాన్ని డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు.

సిద్ధమవుతున్న షణ్ముఖ



మంచి కథాంశం ఎన్నుకుని ఆసక్తి కలిగించే నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. 'శాసన సభ' చిత్రాన్ని అందించిన సాప్పని బ్రదర్స్ నిర్మిస్తున్న రెండో చిత్రం ఇది. షణ్ముగం సాప్పని దర్శకుడు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఆది సాయికుమార్ గెటప్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌ను ఆది వెనుక షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి కనిపిస్తుండడం ఆసక్తిగా మారింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. అద్భుతమైన గ్రాఫిక్స్‌తో విజువల్ వండర్‌గా తెరకు ఎక్కిస్తున్నాం. అన్ని భాషల్లో ఒకేసారి విడుదల చేస్తాం' అని చెప్పారు. తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సస్పెన్షన్ తొలగిస్తారని ఆశిస్తున్నా



బెంగుళూరు రేవ్ పార్టీ కేసులో నటి హేమ అరెస్టయిన సంగతి తెలిసిందే. దీంతో 'మా' అసోసియేషన్ నుంచి ఆమెను సస్పెండ్ చేశారు. తాజాగా, నటి హేమ ఓ లేఖ రాసి, 'మా' అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణుకు అందజేశారు. అందులో "నేను దశాబ్ద కాలం పైగా 'మా'లో సభ్యురాలిగా ఉన్నాను. 'మా' నాకు అమ్మలాంటిది. డ్రగ్స్ కేసులో నాపై అనేక ఆరోపణలు రావడంతో నా అంతట నేనే డ్రగ్స్ శాంపిల్ టెస్ట్ చేయించుకున్నాను. అందులో నాకు నెగెటివ్ వచ్చింది. త్వరలోనే పోలీసులు చేసిన టెస్ట్‌లోనూ ఇదే ఫలితం వస్తుందనే నమ్మకం ఉంది. డ్రగ్స్ కేసులో నాపై జరిగిన దుష్ప్రచారంతో నేను ఎంతో మానసిక క్షోభకు లోనయ్యాను. నా విషయంలో 'మా' సభ్యులు అండగా ఉండాలని కోరుకుంటున్నాను. నాపై సస్పెన్షన్ తొలగిస్తారని ఆశిస్తున్నా" అని లేఖలో పేర్కొన్నారు. అలాగే, త్వరలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అపాయింట్‌మెంట్‌ను తీసుకొని తనకు న్యాయం చేయాలని హేమ కోరనున్నారు.

లక్కీ భాస్కర్ వచ్చేది ఎప్పుడంటే?



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ తెలుగులో నటిస్తున్న తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. 1980-90 ల కాలంలో అసాధారణ స్థాయికి చేరుకున్న ఓ సాధారణ బ్యాంక్ క్యాషియర్ ప్రయాణాన్ని చూపించే సినిమా ఇది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 7న విడుదల కానుంది. చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ విషయాన్ని ప్రకటించింది. 'లక్కీ భాస్కర్' చిత్రం కోసం ఆర్ట్ డైరెక్టర్ బంగ్లాన్ 80ల నాటి ముంబై నగరాన్ని హైదరాబాద్‌లో భారీ సెట్స్‌తో పునర్నిర్మించారు. అలాగే ఆ కాలం నాటి బ్యాంకులను పోలి ఉండే భారీ బ్యాంక్ సెట్‌ను కూడా రూపొందించారు మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/sHzh5PV లో చదవండి.

జగన్‌పై విచారణ జరిపించాలి

● ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం: పేదల కడుపు కొట్టిన జగన్ రెడ్డిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుకు రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ విజ్ఞప్తిచేశారు. లక్షలాది మంది కార్మికులకు జీవనోపాధిని కల్పి స్తూ చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పాలసీ అమలు చేయడంపై రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు మురళీమోహన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక్కక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. హామీల్లో ఒకటైన ఇసుక పాలసీ అమలు వల్ల 40 లక్షల మంది నిర్మాణ రంగం కార్మికులు, 225 ఇతర వృత్తులు వారి జీవనోపాధికి అవకాశం కలిగిందని పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ విధానంలో వినియోగదారులు లేబర్, రవాణా చార్జీలనే భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి పాలనలో నిబంధనలు గాలికి వదిలేసి పర్యావరణానికి తూట్లుపొడిచేలా ఇసుక తవ్వకాలు కొనసాగించారని ఆరోపించారు. అప్పట్లో ఉచిత ఇసుక విధానాన్ని రద్దుచే యడంతో 40 లక్షల కార్మిక కుటుంబాలు రోడ్డునపడ్డాయని గుర్తుచేశారు. పోషణ భారమై 130 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఐదేళ్లలో రూ.50వేలు కోట్లు ఇసుక దోపిడీ జగన్ అండ్‌కో బృందం చేసిందని ఆరోపించారు.

చెరువుల ఆక్రమణపై ఆర్డీవోకు ఫిర్యాదు

రేగిడి: మండలంలోని అప్పాపురంలో చెరువుల ఆక్రమణపై సర్పంచ్ కరణం నిర్మల చీపురుపల్లి ఆర్డీవోకు ఫిర్యాదుచేశారు. సోమవారం నిర్మల విలేకరులతో మాట్లాడుతూ గ్రానైట్ క్వారీల యాజమాన్యాలు సమీపంలో ఉన్న చాకలివానిచెరువు, లక్ష్మీసాగరంతోపాటు మరి కొన్ని చెరువులతోపాటు, గోర్జీలు ఆక్రమించి సాగునీటికి ఇబ్బందులు కలిగిస్తున్నారని వాపోయారు. ఇటీవల చెరువుల ఆక్రమణపై తహసీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదుచేసినా స్పందన లేకపోవడంపై గ్రామస్థులు తరపున ఆర్డీవోకు ఫిర్యాదుచేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ విషయంపై సమగ్ర విచారణచేసి సాగునీటి వనరులను సంరక్షించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

రామభద్రపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పరిష్కార వేదిక పేరిట ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తహసీల్దార్ ఆకుల సులోచణారాణి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రజా పరిష్కార వేదికలో సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతామన్నారు. మొదట ఏ ఫిర్యాదు అయినా మండల స్థాయిలోనే ఇవ్వాల్సి ఉంటుందని, ఇక్కడ పరిష్కారం కాకపోతే, అప్పుడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు ప్రతి సోమవారం వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలి

రామభద్రపురం: రామభద్రపురం మండలంలో మోడల్ స్కూల్ లేకపోవడం వల్ల విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాడివానివలస కోపరేటివ్ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ బండారు నాగరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పిల్లలు ఈ మోడల్‌స్కూల్ లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

కౌలు రైతుల గుర్తింపు సభ

బాడంగి: కోటిపల్లి, వాడాడ రైతు సేవా కేంద్రాల్లో సోమవారం కౌలు రైతుల గుర్తింపు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు, వాడాడ, కోటిపల్లి గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కోసమే స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ

కొత్తవలస: గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్లు శారదా కర్మాగార డీజీఎం హెచ్. సన్యాసిరావు తెలిపారు. శారదా మెటల్స్ అండ్ అల్లాయిస్ కర్మాగారం ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 54 మంది మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మరి కొంతమందికి త్వరలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కర్యాక్రమంలో కర్మాగారానికి చెందిన ప్రతినిధులు శంకరరావు, కె.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ తొలగించాలి

విజయనగరం దాసన్నపేట: డెంకాడ మండలం జొన్నాడ వద్ద గల టోల్‌గేట్‌ను వెంటనే తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగం లేని టోల్‌గేట్ ఎవరి కోసం ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. టోల్‌గేట్ వల్ల బస్సు చార్జీలు, ఇతర వాహన చార్జీలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం ప్రతినిధులు టీవీ రమణ, రెడ్డి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు హామీని నిలబెట్టుకోవాలి

బొబ్బిలి: తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి వస్తే జిల్లాకొక క్యాన్సర్ నివారణ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకునేలా అధినాయకుల దృష్టికి తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే బేబీనాయనను లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. స్థానిక కోటలో సోమవారం ఆయన బేబీనాయనతో ఈ విషయమై చర్చించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. యువగళం యాత్రకు విచ్చేసినప్పుడు నారా లోకేశ్ క్యాన్సర్ ఆసుపత్రులపై స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సరిపడా స్థలం ఉన్నందున వెంటనే ఈ ఏర్పాట్లు చేసేలా ప్రభుత్వాన్ని కోరాలని బేబీనాయన దృష్టికి తెచ్చామని, ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని బాబ్జీ తెలిపారు. పౌరవేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, టీడీపీ నేత కోట్ల సుగుణాకరరావు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపుతో ప్రయోజనం

వంగర: అర్హులైన కౌలు రైతులు ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందడం వల్ల పథకాలు అందడంతోపాటు పలు ప్రయోజనాలు లభిస్తాయని ఏవో కన్నబాబు తెలిపారు. సోమవారం నీలయ్యవలస, బాగెమ్మపేట, పటువర్ధనం గ్రామాల్లో కౌలు రైతు గుర్తింపుకార్డుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామసచివాలయ ఉద్యోగులు అప్పలనాయుడు, పావని పాల్గొన్నారు.

మెలకువలతో కూడిన బోధన అవసరం

జామి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మెళకువలతో కూడిన విద్యను అందించాలని మండల విద్యాశాఖాదికారి-2 గంగరాజు అన్నారు. సోమవారం మండలంలోని పీతలపాలెం ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల పఠన, బోధన శక్తిని పరిశీలించారు.

పరిష్కారం చూపండి

● కలెక్టర్‌కు విన్నవించుకున్న అర్జీదారులు



దివ్యాంగురాలు పావని సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్

కలెక్టరేట్, జూలై 8: తమ న్యాయమైన సమస్యలకు పరిష్కారం చూపాలంటూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులు కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నారు. వినతులు స్వీకరించిన కలెక్టర్ అంబేడ్కర్ వెంటనే పరిశీలించి పరిష్కారం చేయాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశించారు. తనకు ఉద్యోగం ఇప్పించాలంటూ నెల్లిమర్లకు చెందిన ఒక దివ్యాంగురాలు కలెక్టర్‌ను కోరారు. వెంటనే బాక్‌ల్యాగ్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని దివ్యాంగులు సంక్షేమ శాఖ ఏడీకి కలెక్టర్ ఆదేశించారు. ● మహిళా సంఘం నుంచి సుమారు రూ. 6.50 లక్షలు వరకూ రుణం తీసుకున్నారు. తిరిగి చెల్లించమంటే ఘర్షణకు దిగుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. చివరికి చేసేదేమీ లేక జిల్లా కేంద్రానికి వచ్చామని ఇక్కడికి వచ్చిన తరువాత కూడా డీఎస్పీ పట్టించుకోకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. వెంటనే తమకు న్యాయం చేసి తమపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని చీపురుపల్లి చెందిన ఎం. సింహాచలం కలెక్టర్ ఎదుట మొరపెట్టుకున్నారు. ● గుర్ల మండలం పాల వలసలోని నల్లచెరువు పరిధిలో గల సుమారు ఎకరా ప్రభుత్వ భూమిని గ్రామా నికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నారు. ఈ భూమిలో మామిడి మొక్కలు వే సుకుని ఫలసాయం అనుభవిస్తున్నారు. దీనికి ఆనుకుని జిల్లా పరిషత్ పాఠశాల కూడా ఉంది. దీనిని పాఠశాల విద్యార్థుల వినియోగం కోసం గ్రామస్థులు గతం లో నిర్ణయించుకున్నారు. ఈ ఆక్రమణకు గురైన భూమిని కాపాడాలంటూ గతం లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. దీనిపై కోర్టును కూడా ఆశ్రయించగా ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు వచ్చినా ఇ ప్పటి వరకూ అమలు కాలేదని, వెంటనే అధికారులు స్పందించి ఆక్రమణకుగు రైన భూమిని కాపాడాలని పాలవలసకు చెందిన తాడ్డి శ్రీనివాసరావు విన్న వించుకున్నారు. ● డెంకాడ మండలం గుణుపూరుపేటలో అక్రమంగా చేసిన ఆ నందరాజు చెరువు రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేయాలి. ఈఏడాది మే 24, 25 తేదీల్లో సుమారు 15 ఎకరాల చెరువును భోగాపురం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాల యంలోని బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అప్పటిలో దీనిని తెలుసుకు న్న రైతులు ఆందోళన చేయడంతో రిజిస్ట్రేషన్ రద్దు చేస్తున్నట్లు చెప్పినా ఇప్పటి వరకూ అమలు కాలేదు. ఇకనైనా అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్ రద్దు చే యాలని గుణుపూరుపేట గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

కలెక్టరేట్: జిల్లా అన్ని పరిశ్రమలు భద్రతా ప్రమాణాలను విధిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమల్లో ఎక్కడా ఒక్క ప్రమాదం కూడా సంభవించడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని సిమెంట్ పరిశ్రమలో ఆదివారం ప్రమాదం సంభవించిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పరిశ్రమల్లో తనిఖీలు మొదలుపెట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 65 ప్రమాదకర పరిశ్రమలనూ వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. మంగళవారం నుంచి ప్రతి పరిశ్రమను తహసీల్దార్, ఎన్‌హెచ్‌వో సంయుక్తంగా తనిఖీ చేయాలన్నారు. మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే అగ్నిమాపక శాఖ అధికారులు కూడా విడివిడిగా తనిఖీ చేసి 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. మిగిలి ఉన్న సుమారు 540 చిన్నా పెద్దా పరిశ్ర మలను సైతం దశలు వారిగా తనిఖీ చేయాల న్నారు. సమావేశంలో ఇండస్ట్రీస్ జాయింట్ డైరక్ట రు గణపతి, డీఎప్‌వో రామ్ ప్రకాష్, ఆర్‌డీవోలు సూర్యకళ, శాంతి, సాయి శ్రీ, డీఎస్పీ వీర్‌కుమార్ తదితరులు ఉన్నారు. ● విపత్తుల నిర్వహణ రంగంలో వార్షిక జాతీయ అవార్డుగా పిలవబడే సుభాష్ చంద్రబోస్ ఆప్దా ప్రబంధన్ పురస్కారం కోసం వచ్చే నెల 31లోగా దరఖాస్తులు పంపాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో కోరారు. విపత్తు నిర్వహణ రంగంలో విశేష సేవలు అందించిన సంస్థలు లేదా వ్యక్తులకు 2025 సంవత్సరానికి గాను ఈ అవార్డులు అందిస్తామన్నారు.

విద్యార్థులే దేశభవిష్యత్తు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): దేశానికి విద్యార్థులు, యువతే వెన్నెముకని చదువుతో పాటు సమాజ, దేశ సంక్షేమానికి కృషిచెయ్యాలని మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు పిలుపునిచ్చారు. వివిధ వర్గాల నాయకులు, అధికారులు బహుమతులుగా ఇచ్చిన పుస్తకాలను సోమవారం కంటోన్మెంట్ నగర పాలక సంస్థ పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు దేశానికి, సమాజానికి ఉపయోగపడే విధంగా కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజు మాట్లాడుతూ నగరంలో లభించే అన్ని రంగాలకు చెందిన విద్యలో ప్రావీణ్యం సంపాదించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, రాజేష్ వర్మ, అనురాధ బేగం, మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అశోక్

కాలంరాజుపేటలో బేబీనాయన పర్యటన

● సీజనల్ వ్యాధులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న బేబీనాయన

తెర్లాం: మండలంలో కాలంరాజుపేటలో సీజనల్ వ్యాదులు ప్రభలుతుండడంతో స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం పర్యటించారు. గ్రామమంతా తిరిగి జ్వర పీడితులతో మాట్లాడారు. మంచినీటి బావుల నీటిని వాడటం కొంత వరకు ఆపాలని, సురక్షిత నీటిని తాగాలని సూచించారు. అనంతరం గ్రామానికి సంబంధించి పారిశుధ్యంపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లా మలేరియా అధికారి మణి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సూర్యనారాయణకు గ్రామంలో జ్వరాల పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు పెరుమాళి వైద్యులు వెంకటేష్ తన సిబ్బందితో కలిసి గ్రామంలో వైద్యశిబిరాలు ఎర్పాటు చేశామన్నారు. గ్రామంలో శుభ్రత లోపించినందున ఈ సమస్య వచ్చిఉండవచ్చన్నారు. అందుకోసం గ్రామంలో పారిశుధ్య పనులు ప్రారంభించామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య సిబ్బంది అందరికీ అందుబాటులో ఉంటూ పారిశుధ్య పనులు, వైద్య సేవలు అందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అంతకుముందు జిల్లా వైద్యాధికారి బాస్కరరావు గ్రామంలో పర్యటించి జ్వర పీడితుల దగ్గరకు వెళ్లి పలు సూచనలు చేశారు. వైద్యసిబ్బందిని అప్రమత్తం చేశారు. ● గ్రామంలో జ్వరంతో బాధపడుతుంటే మిరంతా ఏం చేస్తున్నారని పెరుమాళి వైద్యులు, సిబ్బంది పని తీరుపై ఎమ్మెల్యే బేబీనాయన మండిపడ్డారు. మీరు సరైన వైద్యం, సూచనలు ఇవ్వకపోవడం వల్లే వాళ్ళు ప్రైవేటు ఆసుపత్రికు వెళ్తున్నారన్నారు. ఇకనుంచి అలా జరిగితే ఉపేక్షించేది లేదన్నారు.

టీడీపీ పేదల పక్షమే

● ఉచిత ఇసుక విధానంతో మేలు ● జిల్లా అధ్యక్షుడు నాగార్జున



మాట్లాడుతున్న నాగార్జున, అదితి

విజయనగరం రూరల్, జూలై 8: తెలుగుదేశం పార్టీది ఎప్పుడూ ప్రజల పక్షమే.. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున చెప్పారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుకను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం, పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల భవన నిర్మాణ రంగం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. తాజాగా చంద్రబాబు ప్రకటించిన ఇసుక పాలసీ కారణంగా భవన నిర్మాణ రంగం మరింత ముందుకు వెళ్తుందన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇసుక సరఫరా విషయంలో తీసుకున్న నిర్ణయాలతో కార్మికులకు చేతి నిండా పని దొరక్క ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇప్పుడు ఇసుకను ఉచితం చేయడం వల్ల భవన నిర్మాణ రంగంపై ఆధారపడే లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై స్పందించకపోతే కఠిన చర్యలు

బొబ్బిలి, జూలై 8: ఈ ప్రాంతంలో రాత్రి వేళల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు అందుతున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఈబీ అధికారులను బొబ్బిలి ఆర్డీవో ఎ.సాయిశ్రీ ఆదేశించారు. సోమవారం సాయంత్రం తనను కలిసిన ఎస్ఈబీ అధికారులతో ఆమె మాట్లాడుతూ తనకు చాలా ఫోన్‌కాల్స్‌లో ఫిర్యాదులు వస్తున్నాయని, అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతుంటే ఎస్ఈబీ అధికారులు స్పందించడం లేదని ఆరోపణలు వస్తున్నాయని ఆమె అన్నారు. గ్రావెల్, ఇసుక అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది కొరత కారణంగా తాము పూర్తి స్థాయిలో విధులు నిర్వహించలేకపోతున్నామని ఎస్ఈబీ అధికారులు బదులివ్వడం గమనార్హం.

జీఎంఆర్‌ను కలిసిన మంత్రి కొండపల్లి



జీఎంఆర్‌ను సత్కరిస్తున్న కొండపల్లి శ్రీనివాస్

రాజాం రూరల్, జూలై 8: ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లిఖార్జునరావును రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఇ., సెర్ప్, ఎన్నారై వ్యవ హారాల శాఖామాత్యు లు కొండపల్లి శ్రీనివాస్ ఢిల్లీలో సోమవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జి.ఎం.ఆర్‌ను మంత్రి శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. తాను రాజాంలోని జి.ఎం.ఆర్.ఐ.టి.లోనే ఇంజినీరింగ్ చదివానని జిఎంఆర్‌కు శ్రీనివాస్ వివరించారు. చదువుకున్న రోజుల్ని గుర్తు చేశారు.

నైతిక విలువలు అవసరం: బేబీనాయన

రామభద్రపురం, జూలై 8: విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తానని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయు లు కృషి చేయాలని సూచించారు. అనంతరం అక్కడి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం మండలంలో ఉన్న అన్ని జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఈవో మోహనరావు, టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతినాయుడు, రామభద్రపురం ఎంపీటీసీలు భవిరెడ్డి చంద్ర, వసంతుల తిరుపతిరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కరణం విజయభాస్కరరావు, ఎంఈఓలు తిరుమలప్రసాద్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంపీడీవోకు టీడీపీ నాయకుల వినతి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

బొబ్బిలి, జూలై 8: మండలంలోని దిబ్బగుడ్డివలస, సీతయ్యపేట గ్రామాలకు చెందిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయా గ్రామాల ఎంపీటీసీ వెన్నెల నాగరాజు, మాజీ సర్పంచ్ సీహెచ్ భాస్కరరావు సోమవారం ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీతయ్యపేట పంచాయతీ కార్యదర్శి జనార్దనరావు మూడునెలలుగా సెలవులో ఉండడంతో దిబ్బగుడ్డివలస సెక్రటరీ వెంకటనాయుడుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారని, ఆయన గ్రామానికి రావడం లేదని ఆరోపించారు. దిబ్బగుడ్డివలసలో గ్రామసభ నిర్వహిస్తామని సమాచారం ఇచ్చి ఆ వెంటనే రద్దు చేశారన్నారు. సర్వర్ పనిచేయడం లేదని చెప్పి గత వారంరోజులుగా ఎటువంటి సర్టిఫికెట్లను డిజిటల్ అసిస్టెంట్ జారీ చేయడం లేదన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్‌తో సేవా కార్యక్రమాలు

విజయనగరం రూరల్, జూలై 8: ఈ ఏడాది ఇన్నర్ వీల్ క్లబ్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించినట్టు ఆ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి శరీత లునానీ చెప్పారు. విజయవాడ నుంచి శ్రీకాకుళం వరకూ ఉన్న ఇన్నర్‌వీల్ క్లబ్‌ల విస్తృతస్థాయి సమావేశం సోమవారం విజయనగరంలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది విద్య, వైద్యం తదితర వాటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు.

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● జిల్లా వైద్యాధికారి భాస్కరరావు



వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో

రాజాం రూరల్, జూలై 8: వైద్యాధికారులు, సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కర్రావు స్పష్టం చేశారు. పట్టణంలోని ఆదర్శనగర్ పట్టణ ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని రాజాం, బొద్దాం, పొగిరి, బూరాడ, రేగిడి ఆముదాలవలస, వంగర, సంతకవిటి, మండాకురిటి ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు, ఆదర్శనగర్, బుచ్చెంపేట పట్టణ ప్రాధమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షణాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం.లు, ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన మందులను సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులదేనని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరగాలని, ఎంసిహెచ్, ఆర్‌సిహెచ్ సేవలు అప్‌లోడ్‌పై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారిణి వై.మణి, డా.ఎస్.చలమయ్య, కె.చంద్రశేఖర్ రాజు, జెసత్యరాజు, డా.జె.కృష్ణ, మోహన్ తదితరులు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● **తెర్లాం:** మండలంలోని పెరుమాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.భాస్కరరావు ఆకస్మికంగా సందర్శించారు. విధి నిర్వహణలో ఉన్న ఫార్మసిస్టు పి.ఆదిలక్ష్మిని, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ రోగుల వివరాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో తప్పక నమోదు చేయాలని ఆదేశించారు. స్టాఫ్‌నర్సు భవానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ప్రసూతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాజరుపట్టి, చలనపట్టి (మూవ్‌మెంట్ రిజిష్టర్), పరిశీలించారు. వైద్య సిబ్బంది చంద్రశేఖర్, సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

గజపతినగరం: జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పురిటిపెంట గ్రామ పంచాయతీ షరాబుల కాలనీకి చెందిన బేతల ఎల్లయ్యమ్మ(63) పనుల నిమిత్తం గజపతినగరం వెళ్లి తిరిగి వస్తూ స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సోమవారం ఉదయం జాతీయ రహదారి దాటుతుండగా మానాపురం వైపు నుంచి విజయనగరం వైపు వెళుతున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎల్లయ్యమ్మను స్థానికులు గజపతినగరంలో ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కోడలు దాలి పార్వతి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బొడ్డవలస రేవులో అధికారుల దాడులు

● ట్రాక్టర్ సీజ్.. రెండు ట్రాక్టర్లపై పోలీసులకు ఫిర్యాదు

రేగిడి: మండలంలోని బొడ్డవలస రేవు వద్ద ఉమ్మడి జిల్లాలోని ఏడు మండలాలకు తాగునీరందించే రక్షితసోర్స్ బావులు, పాలకొండ- విశాఖ ప్రధానమార్గం నాగావళి వంతెన రక్షణపై రెవెన్యూయంత్రాంగం దృష్టిసారించింది. ఈ మేరకు సోమవారం బొడ్డవలస నదీతీరంలో తహసీల్దార్ రాములమ్మ, ఆర్ఐ రేవతి నిర్వహించిన దాడుల్లో మూడు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. స్థానికుల సమాచారంతో ఈ రేవుపై దాడిచేయగా రెడ్‌హ్యాండెడ్‌గా మూడు ట్రాక్టర్లు పట్టుబడగా, వీటిలో రెండు ట్రాక్టర్లు నిర్వాహకులు తప్పించుకొని పరారయ్యారు. పట్టుబడిన ఒక ట్రాక్టర్‌ను సీజ్‌చేసి రూ. 10 వేలు అపరాద రుసుము విధించినట్లు తహసీల్దార్ రాములమ్మ తెలిపారు. రెండు ట్రాక్టర్లు తప్పించుకోవడంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దాడుల్లో సమా చారం ఇచ్చే వరకు పోలీస్‌లు రాకపోవడంపై తహసీల్దార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈవిషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తామని తహసీల్దార్ తెలిపారు. బొడ్డవలస వద్ద ఉన్న ఉమ్మడిజిల్లాల రక్షితబావుల రక్షణకు ప్రత్యేకచర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే ఈ బావుల వద్ద ట్రెంచ్‌లు తీసి క్వారీలు నియంత్రించామని, ఇంకా క్వారీ ఉన్న ప్రాంతాల్లో సోమవారం వీఆర్వో గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో ట్రెంచ్‌లు తీశారని, బొడ్డవలస వద్ద ఇసుక తవ్వకాలు నిషేధించినట్లు చెప్పారు.

ఓబీసీల్లో చేర్పించండి



ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడికి జ్ఞాపికను అందజేస్తున్న శిష్టకరణ సంఘ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, జూలై 8: శిష్టకరణాలను ఓబీసీలో చేర్చే విధంగా పార్లమెంటు సమావేశాల్లో చర్చించాలని జిల్లా శిష్టకరణ సంఘ అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును కోరారు. సోమ వారం విజయనగరంలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఎంపీని కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు వెంకటేష్, మధుసూధనరావు, ఎంపీ తిరుపతిరావు, త్యాడ ప్రసాద పట్నాయక్, ఆరికతోట సురేష్, సతీష్ తదితరులు ఉన్నారు.

విద్య.. వైద్య రంగాలపై దృష్టి పెట్టాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జనసేన నాయకుడు రవికుమార్

విజయనగరం, జూలై 8: విద్య, వైద్య రంగాలపై దృష్టి పెట్టి చర్యలు చేపట్టాలని నూతనంగా వచ్చిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను జనసేన నాయకుడు ఎమ్ రవికుమార్ కోరారు. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పర్చాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపి వినతి పత్రం అందించిన వారిలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్‌వీజీఆర్ ఫ్యాకల్టీ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల సిబ్బంది

విజయనగరం, జూలై 8: డిపార్టమెంట్ ఆఫ్ డేటా ఇంజినీరింగ్ తదితర విభాగాల ఫ్యాకల్టీ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ఎమ్‌వీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఇంటెలిజెంట్ సైబర్-ఫిజికల్ సిస్టం బ్లాక్‌చైన్ టెక్నాలజీ రీసెంట్ ట్రెండ్స్ అండ్ అప్లికేషన్స్‌పై వారం రోజుల డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం కళాశాలలో జరుగుతోంది. బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా అత్యాధునిక లైవ్ ప్రాజెక్టులు, కంపెనీ లేదా రెండు కంపెనీల మధ్య కస్టమర్ డేటాను పంచుకోవటంలో భద్రత, పారదర్శకతకు సంబంధించిన టెక్నాలజీ కీలమైనదని సీనియర్ డెవలపర్ సాయి ప్రశాంత్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ వి నగేష్, పి సతీష్, ఫ్యాకల్టీ విద్యార్థులు పాల్గొన్నారు.

అవుట్‌లుక్ ఐకార్ ర్యాంకింగ్‌లో ప్రథమస్థానం హర్షణీయం



సెంచూరియన్ యూనివర్సిటీ

పర్లాకిమిడి: ఒడిశాలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు అవుట్‌లుక్ ఐకార్ ర్యాంకింగ్-2024లో ప్రథమస్థానం లభించడం గర్వకారణంగా ఉందని యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ సుప్రియ పట్నాయక్ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం అకడమిక్ ఎక్సలెన్స్ ఫ్యాకల్టీ క్వాలిటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రీసెర్చ్ అవుట్ పుట్‌లను పరిశీలించి ఈ ర్యాంక్‌ను అందించారన్నారు. అకడమిక్ ఎక్సలెన్స్ వ్యవసాయ విద్యపై అంకిత భావం, ఆకట్టుకునే ప్రదర్శనతో డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అద్భుత మైన మైలురాయిని సాధించిందన్నారు. అవుట్‌లుక్ ఐకార్ ర్యాంకింగ్‌లో ఎంఎస్‌స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ నెంబర్‌వన్ స్థానం సాధించడంపై వర్సిటీ ఉపాధ్యక్షుడు డీఎన్ రావు హర్షం వ్యక్తంచేశారు. భారతదేశంలోనే అత్యుత్తమ విద్యనందించే యూనివర్శిటీల్లో సెంచూరియన్ యూనివర్శిటీ ఒకటిగా నిలవడం ఆనందం కలిగించిందన్నారు.

పల్లాను కలిసిన అడ్డా గోవింద



పల్లాను కలిసిన అడ్డా గోవింద

బాడంగి, జూలై 8: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును విశాఖపట్టణంలో అతని ఇంటివద్ద టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి అడ్డా గోవింద మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ మేరకు శుభాకాంక్షలు తెలిపారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

● వర్షాకాలంలో సిబ్బందికి తప్పని అవస్థలు
● పట్టించుకోని పాలకులు, అధికారులు

గజపతినగరం: ఎన్నోఏళ్ల కిందట నిర్మించిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అధికారులు, సిబ్బంది తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే భవనాల నుంచి నీరు కారుతుంది.. రికార్డులు తడిచిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. దశాబ్దాలు గడిచిపోవడంతో భవనాల శ్లాబుల నుంచి పెచ్చులు ఊడుతున్నాయి. గోడలకు పగుళ్లు వస్తున్నాయి. చినుకు రాలితే చాలు వర్షపునీరు కార్యాలయంలోకి వచ్చేస్తుంది. కొన్ని సమయాల్లో పాములు కూడా కార్యాలయాల్లో హల్‌చల్ చేస్తున్నాయి.. భయాందోళనతో విధులు నిర్వహించాల్సి వస్తుందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని ఇబ్బందులు పడలేక అద్దె భవనాలు తీసుకుందామన్నా వేల రూపాయలు అద్దె చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. మండలంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో, ఆంధ్ర ఇరిగేషన్ కార్యాలయం, మండల వనరుల కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం, అలాగే పలు గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు పాత భవనాలు కావడంతో వర్షా కాలంలో ఇబ్బందులు తప్పడంలేదని ఆయా శాఖ అధికారులు అంటున్నారు.


పురాతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


శిథిలావస్థకు చేరుకున్న ఆంధ్ర ఇరిగేషన్ కార్యాలయం

ప్రతి ఏడాది తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ ప్రయోజనం లేకపోతుందని అధికారులు వాపోతున్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ పాత భవనాలపై దృష్టి సారించక పోవడం శోచనీయం. ఇప్పటికైనా పాలకులు, జిల్లా అధికారులు పాతభవనాలపై దృష్టి సారించి కొత్త భవనాలు మంజూరు జరిగేలా చర్యలు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

ఎట్టకేలకు బట్టికాలువలో పూడికతీత

● పరిశీలించిన ఎమ్మెల్యే నాగమాధవి


పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం: భోగాపురం బట్టికాలువలో సోమవారం నిర్వహించిన పూడికతీత పనులను ఎమ్మెల్యే లోకం నాగమాధవి పరిశీలించారు. బట్టికాలువను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సగం వరకు అభివృద్ధి చేయగా, వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఈ కాలువ నుంచే గంగిరావి చెరువుకు నీరు చేరుతుంది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడం పూడికతో నిండిపోయింది. దీంతో రైతులు ఇబ్బంది పడకుండా ఉండే విధంగా స్థానిక నాయకులు, యువత, జనసైనికులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే ఇటీవల నిర్వహించిన గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. ఈక్రమంలో పంచాయతీ నిధులు నిధులతో పూడిక తీత పనులు ప్రారంభించారు. ఈ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. బట్టికాలువను ఏడాదిలోగా అభివృద్ధి చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీవో సురేష్, ఇన్‌చార్జి కార్యదర్శి సురేష్, నాయకులు వరుపుల సుధాకర్, పి.జగదీష్, పల్ల రాంబాబు, గుండపు సూర్యారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించాలి

● ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు


జలజీవన్ మిషన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళా

చీపురుపల్లి: చీపురుపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ రక్షిత తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆదేశించారు. సోమవారం రాజాంలోని తన నివాసంలో ఆయన ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య మౌలిక సౌకర్యాల సంస్థకు చెందిన ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికి రక్షిత తాగునీరు అందించాలన్నారు. పథకంలో లోపాలను సరిదిద్దాలని సూచించారు. అనంతరం, చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి మంజూరైన అదనపు భవనాల విషయంలో ఆర్థిక శాఖ అనుమతి రావాల్సి ఉందని తెలిపారు. ముఖ్యమంత్రితో మాట్లాడి, నిధులు తక్షణమే విడుదల అయ్యేలా చూస్తానన్నారు. పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సమీక్షలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు వై.గోవిందరావు, శ్రీలత, జేఈ యుగంధర్, పంచాయతీరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ప్రతినిధులను పార్టీలోకి తీసుకోవాలి

చీపురుపల్లి: రాష్ట్రంలో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే ఇప్పుడున్న స్థానిక సంస్థల ప్రతినిధులందరినీ టీడీపీలోకి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు సూచించారు. సోమవారం చీపురుపల్లిలోని తన నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో వైసీపీ ప్రజాప్రతినిధులే ఉన్నారని చెప్పారు. దీనివల్ల ప్రభుత్వ పాలన సక్రమంగా సాగడానికి అవకాశం ఉండదన్నారు. పంచాయతీరాజ్ శాఖకు న్యాయం చేయాలన్న సంకల్పం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఉన్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో వేరే పార్టీ ప్రతినిధులున్న కారణంగా ఆ పని సులభం కాకపోవచ్చునని గద్దే అభిప్రాయం వ్యక్తం చేశారు. సంబంధిత ఎమ్మెల్యేలతో చర్చించి, అందరినీ పార్టీలోకి చేర్చుకోవాలన్నారు. ఇది సాధ్యం కాని పక్షంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో గతంలో మాదిరిగా మూడంచెల వ్యవస్థను తీసుకు రావాలన్నారు.

పారదర్శకంగా సేవలందించాలి


అధికారులతో చర్చిస్తున్న చంద్రశేఖర్

దత్తిరాజేరు: మండల అధికారులు పారదర్శకంగా సేవలందించాలని టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రకుమారిని కలిసి, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, పంచాయతీ బిల్లుల విషయంలో ఎలాంటి అవకతవకలు రాకూడదని కోరారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సచివాలయ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులను కలుపుకొని పోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బోడసింగి సత్తిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జిలు మజ్జి మహేష్, బెజవాడ బంగారునాయుడు, సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు, మండల అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులు పథకాలపై అవగాహన పొందాలి


మాట్లాడుతున్న ఏవో మల్లికార్జునరావు

బొండపల్లి: కౌలు రైతులు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి మల్లికార్జునరావు అన్నారు. సోమవారం ముద్దూరు గ్రామంలో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు 16 ఆర్‌ఎస్‌కేలలో కౌలురైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 12 కేంద్రాల్లో అవగాహన కల్పించి, సుమారు 50 ఎకరాలు సాగు చేస్తున్న 70 మంది రైతులకు గుర్తింపుకార్డులు అందజేశామని తెలిపారు. ప్రతి కౌలు రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా ముద్దురు గ్రామంలో సర్పంచ్ మునకాల పైడినాయుడు చేతులమీదుగా కౌలు రైతు గుర్తింపు కార్డులు అందజేశారు.

గ్రామసభలో సమస్యల వెల్లువ

డెంకాడ: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో సమస్యలు వెల్లువెత్తాయి. పంచాయతీ కార్యదర్శి వాసు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో పలువురు తమ సమస్యలను వివరించారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వంలో అనర్హులకు పింఛన్లు, అమ్మఒడి పథకాలు అందించారని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చపట్టడం లేదని, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడం లేదని, దీంతో వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభలో పాల్గొన్న ఏవో పి.నిర్మల మాట్లాడుతూ మండలంలోని కౌలు రైతులను జేఎల్‌జీ గ్రూపులుగా గుర్తించి, వారికి బ్యాంకు రుణాలు ఇప్పించి, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరి, ఎంపీటీసీ కుమారి, టీడీపీ నాయకులు పాణిరాజు, వార్డు మెంబర్లు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు కరి కృష్ణ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలోని సూరు నీలకంఠం ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. రికార్డుల్లోని వివరాల మేరకు గోదాముల్లో స్టాకు పరిశీలించారు. ఇన్‌వాయిస్‌లను, బిల్లును తనిఖీ చేశారు. లైసెన్సుల రెన్యువల్స్ తదితర వివరాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు విక్రయాల సమయంలో రైతుల నుంచి తప్పనిసరిగా సంతకాలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో కైకలూరు వ్యవసాయ శాఖ ఏడీ ఆర్.గంగాధరరావు, డీఎస్పీ కె.తాతారావు, చీపురుపల్లి ఏవో సీహెచ్.రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే పాఠశాలలు బలోపేతం

డెంకాడ: కూటమి ప్రభుత్వంతోనే ప్రభుత్వ పాఠశాలల బలోపేతం సాధ్యమని మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు అన్నారు. అక్కివరం ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కంది కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

● ఎస్పీ దీపిక పాటిల్

విజయనగరం క్రైం: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడే వారిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 44 ఫిర్యాదులు స్వీకరించారు.

● రాజాం నగరానికి చెందిన వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.మూడు లక్షలు తీసుకున్నారని, నేటి వరకూ ఎటువంటి ఉద్యోగం కల్పించలేదని, డబ్బులు తిరిగి ఇవ్వలేదని, న్యాయం చేయాలని తెర్లాం మండలం డి.గదబువలసకు చెందిన వ్యక్తి కోరారు. ● తనకు ప్రైవేటు సంస్థలో ఉద్యోగం కల్పిస్తానని తోటపాలెంనకు చెందిన వ్యక్తి రెండు లక్షలు తీసుకున్నారని, నేటి వరకూ ఎటువంటి ఉద్యోగం కల్పించలేదని, తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వలేదని విజయనగరానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. ● తన భర్తతో ఉన్న వివాదాలను పరిష్కరిస్తానని రామవరానికి చెందిన వ్యక్తి రూ.20 వేలు తీసుకుని, వివాదం పరిష్కరించలేదని, ఎన్నిసార్లు అడిగినా, డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని గంట్యాడ మండలం రామవరానికి చెందిన మహిళ ఎస్పీని కోరారు. ఈ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి, తీసుకున్న చర్యలను నివేదించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఆస్మాపరహీన్, డీఎస్పీ వీరకుమార్, సీఐలు విజయనాథ్, నర్సింహమూర్తి, మురళి తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ దీపికా పాటిల్

రైతులకు సాగునీరు అందించాలి

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెద్ద గెడ్డ ద్వారా సాగునీరు అందించాలని ఎమ్మెల్యే బేబీనాయన ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జన్నివలస గ్రామంలో ఉన్న పెద్దగెడ్డ కాలువలను పరిశీలించి ఇరిగేషన్ అధికారులు, రైతులతో ముఖాముఖీ మాట్లాడారు. పెద్దగెడ్డ ద్వారా సుమారు 3 వేల 76 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, ఒక్క జన్నివలస గ్రామానికి మాత్రమే సాగునీరు అందుతుందని రైతులు తెలిపారు. ఇరిగేషన్ డీఈ కనకారావు మాట్లాడుతూ రూ.25 కోట్లతో కాంక్రీట్ లైనింగ్ పనులు మంజూరైనా.. నిధులు విడుదల కాకపోవడంతో చేయలేకపోయామని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ 3 రోజుల్లో 2/70 మిషన్లతో షిల్టు పనులు వేగంగా చేసి రైతులకు సాగునీరు అందించాలని తెలిపారు. మిర్తివలస గ్రామానికి సాగునీరు అందించగల అవకాశం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. లస్కర్లు లేకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరిగేషన్ డీఈ కనకారావు, జన్నివలస టీడీపీ నాయకులు పత్తిగుళ్ల యోగినాయుడు, పత్తిగుళ్ల సత్యంనాయుడు పాల్గొన్నారు.

● బొబ్బిలి నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి త్వరలోనే గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఆరు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి.. పరిష్కారం కోసం అన్ని చర్యలు చేపడతానని తెలిపారు.


జన్నివలసలో పెద్దగెడ్డ కాలువ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

తారాపురంలో సమస్యల మోత

తారాపురం గ్రామంలో సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. సోమవారం ఆయన ఆ గ్రామంలో పర్యటించారు. పెద్దగెడ్డ ద్వారా సాగునీరు అందించాలని, రోడ్లు, కాలువల సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. శ్మశానానికి రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బెవర సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం


ఆరోగ్యశ్రీ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శృంగవరపుకోట: స్థానిక సంజీవిని ఆసుపత్రిలో సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆరోగ్యశ్రీ సేవలను ప్రారంభించారు. ఈ సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్, నాయకులు కాపుగంటి శ్రీనివాసరావు, చెక్క కిరణ్ కుమార్, మల్ల రామకృష్ణ, కొట్యాడ రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ వీసీలో అధికారులు


వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

భోగాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మండల శాఖ అధికారులు సమయనుకూలంగా హాజరై, ఆసక్తిగా తిలకించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ నిర్వహిస్తున్న అదే సమయంలో అన్ని మండలాల్లో అధికారులు వీసీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయా మండలాల ప్రజలు వినతులు సమర్పిస్తే.. వీసీ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి, పరిష్కరించే విధంగా కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఎన్నడూ లేనివిధంగా మండల అధికారులందరూ సమయనుకూలంగా వీసీకి హాజరై, శ్రద్ధగా తిలకించడం ఆశ్చర్యపరిచింది.

ప్రజలకు ఇబ్బంది లేకుండా వ్యాపారం చేసుకోండి

భోగాపురం: రహదారులకు ఇరువైపుల వ్యాపారం చేస్తున్నవారు ప్రజలకు ఇబ్బంది కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని సీఐ ఎ.రవికుమార్ హెచ్చరించారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో రెడ్డికంచేరు గ్రామానికి చెందిన వ్యాపారులతో ఆయన మాట్లాడారు. రహదారికి ఇరువైపుల సాగిస్తున్న వ్యాపారాల వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా, అలాగే అక్రమంగా పెట్రోల్ అమ్మినా, నిబంధనలకు వ్యతిరేకంగా గ్యాస్ బండలు నిల్వ ఉన్నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొత్త చట్టాల ప్రకారం అధిక మొత్తంలో అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఎస్ఐ తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలి

గజపతినగరం: మండల పరిషత్‌కు సంబంధించి ఎంపీ నిధుల నుంచి వచ్చిన ట్రాక్టర్ ఐదేళ్లుగా కనిపించకుండా పోయిందని.. తక్షణమే అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకోవాలని ముచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కృష్ణతో పాటు టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో జయింతి ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. గతంలో ఎంపీ నిధులతో మంజూరైన ట్రాక్టర్ 2014-19 వరకు ఎంపీడీవో కార్యాలయంలో ఉండేదని.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కనిపించకుండా పోయిందన్నారు. అధికారులు తక్షణమే ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరారు. గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 263లోగల డీపట్టా భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు 15 ఎకరాల్లో యంత్రాలతో తుప్పలు, తొలగించి చదును చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.రమణ, జి.గోపి, ఏపీ నాయుడు, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంపై రాళ్లతో దాడి


పగిలిన కిటికీ అద్దం

గజపతినగరం: సీతారామపురం గ్రామంలో గల రైతు సేవా కేంద్రంపై గుర్తు తెలియని దుండగలు ఆదివారం రాత్రి రాళ్లతో దాడి చేసినట్లు ఏఈవో సతీష్ సోమవారం విలేకర్లకు తెలిపారు. సోమవారం కేంద్రానికి వెళ్లి తలుపు తీయగా కిటికీ అద్దాలు పగిలిపోయి ఉండడంతో పాటు కంప్యూటర్ రూమ్ కొంత దెబ్బతిందని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, కంప్యూటర్, ఫర్నీచర్ ఉన్న గదికి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇలా ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు తగవని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు దర్యాప్తు చేపట్టనున్నట్టు ఎస్ఐ మహేష్ తెలిపారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

నెల్లిమర్ల: దివంగత నేత, మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం స్థానిక మొయిద జంక్షన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ సురేష్‌బాబు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, సారిక వైకుంఠంనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **భోగాపురం:** వైఎస్సార్ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పూలమాలలు వేసి, నివాళిలు అర్పించారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ● **గుర్ల:** వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న ఆయన విగ్రహానికి జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు పూలమాల వేసి, నివాళులు అర్పించారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** వైఎస్ఆర్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. ● **బొబ్బిలి:** వైఎస్ఆర్ జయంతి సందర్భంగా స్థానిక అమ్మిగారి కోనేరుగట్టుపైగల ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ● **చీపురుపల్లి:** దివంగత నేత వైఎస్ఆర్ జయంతి సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువ నీరు అందించాలి

నెల్లిమర్ల: సతివాడ గ్రామ సమీపంలో ఉన్న తోటపల్లి కాలువలో ఉపాధి హామీ పథకం పనులను ఎంపీపీ అంబళ్ల సుధారాణి సోమవారం పరిశీలించారు. స్థానికులతోను, ఇరిగేషన్ అధికారులతోను మాట్లాడారు. రానున్న ఖరీఫ్‌కు తోటపల్లి కాలువ ద్వారా శతశాతం నీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంబళ్ల శ్రీరాములునాయుడు, సతివాడ సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీకి పరుగులు

● గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్న వినియోగదారులు

భోగాపురం: అర్హులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో వినియోగదారులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఈ సిలిండర్లు పొందాలంటే ముందుగా ఈకేవైసీ చేయించుకోవాలని గ్యాస్ ఏజెన్సీలు ప్రకటించాయి. దీంతో గ్యాస్ కనక్షన్ ఉన్న లబ్ధిదారులు కేవైసీ చేయుంచుకొనేందుకు గ్యాస్ ఏజీన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు.


భోగాపురం హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద వినియోగదారుల కోలాహలం

క్లుప్తంగా..

రెండు రోజులు నీటి సరఫరా బంద్

గరివిడి: గుర్ల మండలం గుజ్జంగివలస పంప్ హౌస్ నుంచి కొండపాలెం మేజర్ పంచాయతీకి తాగునీరు సరఫరా వస్తున్న పైప్‌లైన్‌కు గరివిడి రైల్వే ట్రాక్ సమీపంలో రంధ్రం పడింది. దీంతో ఈ పైపులైన్‌కు రెండు రోజుల పాటు అనగా మంగళవారం, బుధవారం మరమ్మతులు చేపట్టనున్నందున నీటి సరఫరా నిలుపదల చేసినట్టుగా స్థానిక పంచాయతీ కార్య నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని డీఎఫ్ఎన్ డిబ్బేరియా, ఈహెచ్ కోలనీ, టీచర్స్ కాలనీ, పాత సినిమా హాల్, మెయిన్ రోడ్ ఏరియాలో నీటి సరఫరా బంద్ చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

కేంద్ర మంత్రిని కలిసిన నాగార్జున



చీపురుపల్లి: కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీకాకుళంలోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. నాగార్జున వెంట పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన రవిశేఖర్


శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రవిశేఖర్, వనజాక్షి

నెల్లిమర్ల: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి విశాఖలోని ఆయన స్వగృహంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోనూ, నెల్లిమర్ల నియోజకవర్గంలోనూ టీడీపీ పరిస్థితులపై చర్చించారు.

15వ ఆర్థిక సంఘ నిధుల వివరాలివ్వండి


వీఆర్వో ఎర్నమ్మకు వినతిపత్రం ఇస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

జామి: లొట్లపల్లి పంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో ఖర్చు చేసిన 15వ ఆర్థిక సంఘ నిధుల వివరాలు తెలియజేయాలని మండల టీడీపీ, జనసేన నాయకులు కోరారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి ఎర్నమ్మను కలిసి వినతిపత్రం అందించారు. జనసేన, టీడీపీ నాయకులు జన్నెల బాలకృష్ణ, సిడగ వెంకటరావు, వెంకట్, నాగేష్, రమేష్, మధు, రాకేష్, గణేష్ తదితరులు మట్లాడుతూ ఈ నిధుల వివరాలు వెంటనే అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని తెలిపారు.